

# నేమ్ వరియన్

పాలకోడేటి సత్యనారాయణరావు

క్రమలకు జరిగిన అన్యాయం నాకు ఆఫీసుకు వెళ్ళివెళ్ళగానే తెలిసి పోయింది. మనోహరరావు పేరు మనోహరంగానే ఉంది కానీ అతని పనేమీ బాగోలేదు. ఇలా ఓ ఆడ దాన్ని అన్యాయం చెయ్యాలని అనుకోవటం మనోహరరావుకు ఎలా తట్టిందో కూడా నాకు అర్థం కాలేదు

తిన్నగా కమల ఉండే సీటు దగ్గరకు వెళ్ళాను. చేతిలోని ఫైలును పక్కన పెట్టి, "కూర్చోండి" అంది స్టూలును నా వైపు జరుపుతూ.

కూర్చున్నాను.

"మీకు తెలిసిందా?" అడిగింది కమల.

"ఆఁ" అన్నాను.

"వెధవ. నా డబ్బు తిని ఏం బాగుపడతాడో చూస్తాను!" అంది కసితో కమల.

నాకు నవ్వొచ్చింది—ఈ ఆడ జనాభా అంతా ఇంతే. మొదట చెప్పినప్పుడు వినరు. ఆ తర్వాత 'మీరు చెప్పారు కానీ విననందుకు, ఇదిగో ఇలా జరిగింది' అంటూ



నిలయం
శ్రీకాకుళం

కన్నీళ్ళొకటి తక్కువగా బాధతో చెప్తారు. కానీ అప్పటికే చేతులూ అవీ—అన్నీ కాలిపోయి ఉంటాయి.

మనోహరరావు సంగతి నాకు ఇంతక్రితమే తెలుసు. కానీ అతని స్థాయి కమలలాటి సాధు జంతువుల్ని సైతం మోసగించే స్థితికి దిగజారిందని మాత్రం నాకు తెలీదు.

కమల మొట్టమొదటి రోజున ఆ సంగతి చెప్పగానే నేను జాగ్రత్తగా ఉండమని ఆమెను హెచ్చరించాను. "మీ కతని గురించి సరిగ్గా తెలీదు. కొంచెం జాగ్రత్తగా ఉండండి" అన్నాను.

కమల నవ్వేసింది. "ఏం చేస్తాదేమిటి? ఏం చేసినా సరే, మీరంతా లేరూ-నాలుగు చీవాట్లు పెట్టడానికి" అందామె.

అంత ధైర్యంగా మాట్లాడుతూ, మా మగతనం మీద అంత నమ్మకం ప్రదర్శించేసరికి నాకు ఇంకో మాట మాట్లాడే ధైర్యం లేకపోయింది. నిజంగా కమల

అడిగితే కాపీ నాకుతెలీలేదు- 'అతను ఏం చేస్తాడు?' అన్న ప్రశ్నకు సరైన సమాధానం నా దగ్గర లేదని. అందుకే ఏ జవాబూ ఇవ్వక ఊరకుండి పోయాను.

కమల అనుకొన్నట్లుగా మనోహరరావు చేస్తున్న చిట్‌లో చేరింది. నిజానికి ఆ చిట్ పద్ధతిలో ప్రమాదకరమైందీ, మోసమూ ఏమీ లేదు. ఉన్న ఇరవై మందీ నెలకో వంద చొప్పున వేసుకోవటం—ప్రతినెలా అయిదో తారీఖున లాటరీ తీసి ఎవరికి ఆ నెల చీటీ డబ్బు మొత్తం ఇవ్వాలో అదృష్టాన్ని పరీక్షించుకొని వారికి ఆ మొత్తం అందజేయడం. ఇంతే! ఇంత ప్రమాదరహితమైన స్కీం ఇంకోటి నిజంగా లేదు. ఆపద్బాంధవి వంటి ఈ పద్ధతిలో చేరమని మనోహరరావు నన్నూ అడిగాడు. కానీ నెలనెలా వంద రూపాయలు ఇచ్చేంత స్తోమత లేదన్న కారణంగా నేను చేరలేదు. చేరిన మిగతా జనం అంతా మనోహరరావునే చిట్‌ని నిర్వహించమని అడగడంతో అతను బలవంతం మీద అంగీకరించాడట!

వెంటనే మనోహరరావు గురించి కమలను హెచ్చరించాను. అతనికి బ్రాంచీ ఆఫీసులో ఉన్న పేరేమంతగా చెప్పుకోదగ్గది కాదు. పైగా ఒకసారి ఆఫీసు డబ్బు దుర్వినియోగం చేశాడనే నెపంమీద అతన్ని సస్పెండ్ చేశారు. కానీ ఆ తర్వాత ఏం జరిగిందో, ఏ మసిబూసి మారేడుకాయ చేసి మాయమయిన డబ్బును ఏ మహేంద్రజాలంతో తెప్పించాడో కానీ మళ్ళీ ఆఫీసులో చేరాడు. కానీ బ్రాంచ్ ఆఫీసులో ఇక ముఖం చెల్లదను కొని కాబోలు, ట్రాన్స్‌ఫర్‌కు పెట్టుకొన్నాడు. ఆ తర్వాత మా ఆఫీసులో మా మధ్య పడ్డాడు శ్రీశ్రీ మనోహరరావు.

"నేను ఆ రోజు చెబితే విన్నారు కాదు" అన్నాను సానుభూతితో.

కమల నా కేసి తీక్షణంగా చూస్తూ అంది—"అనుకొన్నాను. మీరు వస్తున్నారంటే ఏదో చేస్తారని కాదు కానీ, ఇలా దెప్పి పొడుస్తారని మాత్రం ఊహించుకోగలిగాను" అంది.

నాకు బాధ కలిగింది. "మీది ఇప్పుడు గిల్టీగా ఉన్న పరిస్థితి. అయినా అసలు ఏం జరిగిందో చెప్పండి నాకు!"

కమల క్షణం ఆగింది. ఏమనుకొందో ఏమిటో కానీ చెప్పటం ప్రారంభించింది—"నా మాట మీరు నమ్ముతారో నమ్మరో కానీ నేను చెప్పేది నిజం. మొన్న—అంటే

ముప్పయవ తేదీ సాయంత్రం— జీతాలు అందుకొన్న గంట తర్వాత మనోహరరావు నా సీటు దగ్గర కొచ్చి నేనివ్వాల్సిన వందా వసూలు చేసుకొని వెళ్ళాడు. మామూలుగా ఆ సాయంత్రమే మన లాటరీ. లాటరీలో నా పేరే వచ్చింది. అంటే మొత్తం డబ్బు నాకు రావా లన్న మాట. ఔనా!" అంది కమల నన్ను ప్రశ్నిస్తూ.

"అవును" అన్నాను నేను తలూపుతూ.

"కదా-మర్నాడు మధ్యాహ్నం నా దగ్గరికి వచ్చి మొత్తం పం దొమ్మిది వందలు చేతిలో పెట్టి— 'కమలగారూ! మీరు ఇవ్వాల్సిన వందా దీంట్లో వేస్తే మొత్తం రెండువేలవుతుంది. ఈ నెల మీదే కదా! ఇంక నాకు డబ్బు ఇవ్వటం దేనికి?' అంటూ మొత్తం అం దించాడు. నాకు నోట మాట రాలేదు. ఆశ్చర్యపోయాను. మనో హరరావు గురించి మీరు చెప్పింది వెంటనే గుర్తొచ్చింది. కానీ నోరు


# కొత్త సీరియల్

ప్రముఖ రచయిత్రి కలం నుండి వెలువడిన
సరికొత్త సాంఘిక సీరియల్—

"కడుపు తీపి"

"కడుపు తీపి"

"కడుపు తీపి"

**"కడుపు తీపి"**

త్వరలో 'విజయ'లో ప్రారంభించబోతున్నామని
తెలియజేయుటకు సంతసిస్తున్నాం.

పూర్తి వివరాలు వచ్చే సంచికలో!

తెరిచే లోపునే అతను వెళ్ళి పోయాడు. ఆ షాక్ నుంచి తేరుకొని లంచ్ తర్వాత అతను రాగానే అడిగాను—'నాకు రావాల్సింది రెండువేలు కదా! మరి పందొమ్మిది వందలే ఇచ్చారేం?' అని. 'చెప్పేను కదండీ! మీ వందా వేసుకొంటే రెండువేలు లెక్కసరి పోతుందని' అని దబాయించే శాడు అతడు. నాకు ఒళ్ళు మండుతున్నా తమాయించుకొని అడిగాను— 'నిన్న మీరు నా దగ్గర తీసుకున్నారు కదా నా వంద?' అని. మనోహరరావు గొప్పగా నోరు తెరిచాడు—'అరె! బలేగా అంటున్నారే! నిన్న మీరు నాకు వంద యివ్వడం ఏమిటి? కల గంటున్నారా ఏం? మీ రిచ్చింది బహుశా ఇంటివాడికో పాలవాడికో అయిఉంటుంది. గుర్తు తెచ్చు కోండి!' అనేశాడు. నాకు అతని ఉద్దేశం అర్థమయింది. ఇంక నేను అరిచి గీ పెట్టేది—అతను వంద ఇవ్వడు. అయినా అడిగాను—'ఇలా చేయడం అన్యాయం సుమండీ! న్యాయంగా నాకు ఇంకో వంద రావాలి, నేను మీకు నిన్ననే నా వంద ఇచ్చాను కనుక' అన్నాను.

'ఎవరండీ మీకు సాక్ష్యం? ఇలా మీరు ప్లేటు ఫిరాయిస్తారని తెలిసివుంటే రసీదులు పద్ధతిని పెట్టేవాడిని' అన్నాడు. ఇంకేమీ అనలేదు నేను. నేను ఆశదాన్ని. ఏ ఆగమూ చేయననే పద్ధతిలోనే అతని పని చేశాడు. అయినా అందర్నీ పిలిచాను. జరిగింది చెప్పాను. మనోహరరావు అందర్నీ ఒకటే ప్రశ్న అడిగాడు—'మీరూ ఈ చిట్‌లో ఉన్నారు కదా! మీకు డబ్బు వచ్చినపుడు ఇలా జరిగిందా?' అంటూ. లేదనేదే అందరి జవాబు అయింది. నా కేసు ఉప్పు లోకి లేకుండా అందరూ కొట్టే శారు" అంది కమల.

నేనేమీ అనలేదు. రోజులేమీ బాగుండలేదు. మనం మనుషులమే నని ఇప్పుడు ఇంకోరి సాక్ష్యం అవసరం అయిపోతోంది. కళ్ళతో చూసిన దాన్ని నమ్మం, చెవులతో విన్నదాన్నీ నమ్మం. మన పీడ లంటేనే మనకు అనుమానం. నా వెనుక ఉండేది నా నీడేనని ఎవ రైనా నాకు సర్టిఫికేట్ ఇవ్వటమో సాక్ష్యం చెప్పటమో తప్పిస్తే, అది నా నీడ అని నేను నమ్మ కూడని రోజులు. అలా చెప్పినా ఎవరూ నమ్మని రోజులు.

కమల విషయంలో అందరూ అన్నట్లే నేనూ అనాల్సి వచ్చింది. 'నిజమే! ఆ వెధవ దగ్గర డబ్బులు

పోగొట్టుకోవాల్సి వచ్చింది, మాటా పడాల్సి వచ్చింది. నా రాత బాగు లేదు!' అనుకొంది కమల— కొంత నాతో అంటూ, కొంత మనసులో అనుకొంటూ.

నా సీటుకు వచ్చేశాను—క్షణం తర్వాత మనోహరరావు కేసి చూశాను. అతని వంటిమీద కొత్త బట్టలు. అవి అతని కష్టార్జితం కావచ్చు. కానీ నాకు అలా అనుకో బుద్ధి కాలేదు. మనసంతా మలినం అయిపోయింది కనుక అవి ఎక్కడో మోసంచేసి తీసుకొన్నవే నవి నా మనసులోనే నేను అనుకొన్నాను.

అలా అనుకొన్నాక, అతని షర్టుకు ఒక వందరూపాయిల కాగితం అంటుకొన్నట్లు కనపడింది. ఆ కాగితంమీద 'కమల ధర్మం' అని రాసిఉన్నట్లు తోచింది.

కానీ అదంతా నా భ్రమ.

* * *

దాదాపొక నెల గడిచింది. ఈ నెలరోజులూ కమలనూ, మనోహర రావునూ పరిశీలనగానే చూశాను. ఎవరైనా ఒకరొచ్చి 'తప్పు జరిగింది' అని అంటారేమోనని! కానీ అలా జరగలేదు

కమల మాత్రం మనోహర రావును చూపులతోనే కాల్చేస్తోంది. 'పాపం, బాధితురాలుకదా?' అనుకొన్నాను.

మనోహరరావు అంతక్రితం ఎలా ఉండేవాడో అలాగే ఉన్నాడు. అంటే అతనిలో తప్పేమీ లేదు కాబోలు-అనీ అనుకున్నాను. ఒకసారి ఆ మాటే కమలతో అంటే నవ్వుతూ అంది—'మీ ఇంటి పేరు జి. అని నాకు తెలుసుకానీ గోడ మీదపిల్లి అని నాకు తెలీలేదు ఇంతకాలం.'

కమల పెట్టిన చురక చురుక్కుమంది. కానీ నేనేం చేయను? ఒకే సన్నివేశాన్ని రెండు కోణాల్లోంచి చూస్తున్నాను. రెండు రకాలుగా కనపడటం ధర్మం. పైగా సన్నివేశం నా ముందు జరిగింది కూడా కాకపోవడం తో నా దృష్టి లోపం ఏమీ లేదనే నమ్మకమూ నా కుంది!

'పోనిద్దూ, ఆఫీసు అన్నాక పైళ్ళూ, కాగితాలతో బాటు కొందరు మనుషులూ ఉంటారు. వారి మనస్తత్వాలూ తప్పని సరిగా ఆఫీసుకు హాజరవుతాయి. ఏం చేస్తాం? ఇష్టంలేని ఫైల్సుతో జీవితం గడిపి నట్లే, ఇష్టంలేని మనుషుల మనస్తత్వాల మధ్యా కాపురం చేయక తప్పదు.'

అలా అనుకొన్న రెండోరోజు సాయంత్రం-ఇంటికి వెళ్ళిపోబోయే

పైంం అవుతోంంటే కమల సీటుదగ్గర పెద్ద ఘర్షణ.

మనోహరరావు కూడా అక్కడే ఉన్నాడు. కాఫీ తాగివచ్చే లోపునే ఇంత ఘర్షణ ఎలా జరుగుతోందో అని ఆశ్చర్యంతో అటుకేసి నడిచాను.

"లేదండి బాబూ! మీరు ఇవ్వలేదు అంటూంటే...." అంటున్నాడు మనోహరరావు ప్రాధేయపడుతున్నట్లుగా.

"మిస్టర్ మనోహరరావ్! ఇందాక నేను మీకు రెండు యాభై రూపాయిల నోట్లు ఇచ్చాను. కావాలంటే మీ జేబు చూసుకోండి. ఇదిగో-ఇదీ నా నోట్లకట్టలో ఆఖరి నెంబరు. తొమ్మిది మూడు సున్నా సున్నా ఆరు నాలుగు. ఐదు, ఆరు నెంబర్ల నోట్లు మీ జేబులో ఉంటాయి చూస్కోండి. బొత్తులో చివరి రెండు నోట్లూ మీకే ఇచ్చాను" అంది కమల.

మనోహరరావు ఉలిక్కిపడ్డాడు.

"పోనీండి. చూడండి, ఆమె అంత ఖచ్చితంగా చెబుతోంంటే ఇంకా నమ్మకపోతే ఎలా?" అన్నారెవరో.

మనోహరరావు జేబులోంచి డబ్బు తీయలేదు. "నా కొచ్చిన జీతం అరొందల ఇరవై ఆరు. నా జేబులో ఉన్నదంతా అదే. ఎక్కువ ఉంటే చెప్పుతో కొట్టండి" అంటున్నాడు.

"అసలు ముందు తీయండి లెక్కపెడదాం" అన్నాను నేను.

మనోహరరావు జేబులోంచి డబ్బు తీశాడు—నేనే అందుకొని లెక్కపెట్టాను. అయిదు వంద రూపాయిలనోట్లు, రెండు యాభై రూపాయిలనోట్లు, ఒక ఇరవై నోటు, ఒకటి అయిదు. ఇంకొటి ఒక్క రూపాయి నోటునూ—ఖచ్చితంగా అరొందల ఇరవై ఆరు కానీ యాభై రూపాయిల నోట్ల మీద నెంబర్లు మాత్రం కమల చెప్పినవే!

"చూశారా! ఖచ్చితంగా నా జీతమే ఉంది" అన్నాడు మనోహరరావు గెలిచానన్నట్లు.

"ఆ యాభై లమీద నెంబర్లు చూడండి—నేను చెప్పినవే కదా?" అంది కమల. నేను ఔనన్నట్లు తలఊపాను.

"మరి నా జీతంలో వంద తక్కువ అవుతుంది కదా?"

"ఏమో! ఏ ఇంటివాడికిచ్చారో, ఏ పాలోడికిచ్చారో నాకు తెలీదు. నేను ఈ నోట్లు ఇచ్చానన్న సాక్ష్యం మాత్రం ఉంది. ఇంక చాలు, వెళ్ళండి—ఈ పంచాయితీ ఇక

చాలు—" అంది కమల తీక్షణంగా.

మనోహరరావు ఏదో అనబోయాడు కానీ, ఎవరూ అతనికి అవకాశం ఇవ్వలేదు. "అవిరఅంత ఖచ్చితమైన సాక్ష్యం చెబితే ఇంకా ఏమిటయ్యా నీ గొడవ? అయినా నీ పద్ధతి ఇక్కడా మొదలెట్టావా?" అని ఒకరంటే, ఇంకొకరు—"ఎక్కడికి వెళ్ళినా ఆ బుద్ధి ఎలా మారుతుందండీ?" అని అంటోంటే-"చిట్‌లో మిగతాజనం అయినా ఇక జాగ్రత్తపడండిరా!" అని వేరొకరు అంటున్నారు.

మనోహరరావు వెంటనే అక్కడినుంచి కదిలాడు.

అందరూ వెళ్ళిపోయాక నేను మెట్లు దిగుతోంటే కమల వెనుక నుంచి పిల్చింది—"ఉండండి, నేనూ వస్తా. కలిపి వెళదాం!" అంటూ.

ఆగాను.

మెట్లు దిగాం.

చెట్లకింద నడుస్తోంటే కమలే అంది—"రావుగారూ! కష్టార్జితం అంటే ఏమిటో నాకు ఇపుడు తెలిసిందండీ! క్రితం నెల ఇచ్చాను బాబూ అంటే ఒక్కరూ నా మాట నమ్మినట్లు లేదు. ఈ నెల ఇచ్చాను అనేసరికి అందరూ నమ్మేశారు—కానీ...." ఆగింది కమల.

"అంటే, మీరు నిజంగా వంద ఇవ్వలేదా?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఇచ్చాను. ఈ రోజుకాదు, నెలరోజుల క్రితం. ఆ రోజు ఇచ్చిన మాట ఎంత నిజమో, ఈ రోజు ఇవ్వని మాటా అంతే నిజం!"

"మరి నోట్ల నెంబర్లు...?"

"ఏముందండీ—కౌంటర్లో జీతం నా తర్వాత మనోహరరావు తీసుకొన్నాడు. వందరూపాయలకు రెండుయాభై ల చిల్లర అడగటము నాకు తెలుసు. అందుకే ధైర్యంగా చెప్పాను. అబద్ధమైనా సాక్ష్యం గోడలా నిలబడి నన్ను నిలబెట్టింది."

"మరి—అతను నాసంగతి, అదే చిల్లర తీసుకొన్న సంగతి చెప్పి ఉంటే....?"

"మీరెంత పిచ్చివారండీ—ఈ రోజు నెలాఖరు రోజు. జీతాలు సరిగా లెక్క చూసి ఇచ్చే టయిమే ఉండదుఆ కౌంటర్ క్లర్క్‌కు. ఇంక ఎవరికి చిల్లర ఇచ్చిందీ ఎవరికి నోట్లు ఇచ్చి ఆ నోట్ల నెంబర్లు ఎంతనేదీ ఎక్కడ గుర్తుంచుకొంటాడు చెప్పండి?" అంది నవ్వుతూ కమల.

నేనూ నవ్వేశాను. •